సాక్షి
విశాఖపట్నం
శుక్రవారం । 30 । ఆగస్టు । 2024


తెలుగుపై ప్రభుత్వం చిన్నచూపు 8లో


బీఎస్ఎన్ఎల్ 4జీ సేవలు ఆరంభం 8లో


కోతకు గురైన తీరం 8లో



### పోలీస్ రక్షణ తప్పనిసరి

ప్రభుత్వ ఆస్పత్రుల్లో రాత్రి సమయాల్లో విధి నిర్వహణలో ఉండే వైద్యులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దేవుడి మీద భారం వేసి పనిచేస్తున్నారు. మహిళా వైద్యులు, సిబ్బంది రక్షణపై తగిన చర్యలు తీసుకోవాలి. అవసరమైన సదుపాయాలు, కనీస వసతులు కల్పించాలి. వైద్య సిబ్బంది కోసం ప్రభుత్వాలు కొన్ని రక్షణ చట్టాలను కఠినంగా అమలు చేయాలి. సీసీ కెమెరాలు తప్పనిసరిగా ఏర్పాటు చేయాలి.

**– డాక్టర్ ఎ.కవిత, అసిస్టెంట్ ప్రొఫెసర్, గైనిక్ విభాగం, కేజీహెచ్**



### కఠిన శిక్షలు విధించాలి

మహిళా వైద్యులు, వైద్య సిబ్బందిపై తరచూ జరుగుతున్న లైంగిక దాడుల ఘటనలపై జాతీయ స్థాయిలో పటిష్టమైన చట్టాన్ని తీసుకురావాలి. ప్రజల ఆరోగ్య పరిరక్షణ కోసం నిరంతరం సేవలందిస్తున్న వైద్య సిబ్బందిపై దాడులను తీవ్రంగా పరిగణించాలి. నర్సులకు అవసరమైన సదుపాయాలు కల్పించాలి. భద్రత ఏర్పాటు చేయాలి.

**– డాక్టర్ సునీత రెడ్డి, చైర్మన్, సెయింట్ జోసెఫ్ నర్సింగ్ కాలేజీ**

## న్యూస్‌రీల్

### తెలుగు భాష గొప్పతనం తెలియజేద్దాం


గిడుగు రామ్మూర్తి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న కలెక్టర్ హరేందిర ప్రసాద్

**మహారాణిపేట:** భావితరాలకు తెలుగు భాష గొప్పతనాన్ని తెలియజేయాల్సిన బాధ్యత మనందరిపై ఉందని కలెక్టర్ ఎం.ఎన్.హరేందిర ప్రసాద్ ప్రజలకు పిలుపు నిచ్చారు. ప్రతి ఇంటిలో అమ్మ, నాన్న పిలుపుతో తెలుగు భాష అమలుకావాలని ఆకాంక్షించారు. గిడుగు వెంకట రామ్మూర్తి జయంతి సందర్భంగా గురువారం ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రాంథిక భాషలో ఉన్న తెలుగు వచనాన్ని వాడుక భాషలోకి తీసుకొచ్చిన ఘనత గిడుగుదని అన్నారు. తెలుగు భాష గొప్పతనాన్ని భావితరాలకు తెలియ జేసేందుకు మనమంతా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో డీఆర్వో కె.మోహన్‌కుమార్, కలెక్టరేట్ పరిపాలన అధికారి కె.వి.ఈశ్వరరావు, వివిధ విభాగాల పర్యవేక్షకులు పాల్గొన్నారు.

### మహిళా పోలీస్‌స్టేషన్ ఏసీపీగా పెంటారావు



**విశాఖ సిటీ:** విశాఖ మహిళా పోలీస్‌స్టేషన్ ఏసీపీగా సిహెచ్.పెంటారావు గురువారం బాధ్యతలు స్వీకరించారు. 1991 ఎస్ఐ బ్యాచ్‌కు చెందిన ఆయన పదోన్నతులపై నగరంలో పలు హోదాల్లో పనిచేశారు. తాజాగా జరిగిన బదిలీల్లో విశాఖ సీఐడీ నుంచి విశాఖ మహిళా పోలీస్‌స్టేషన్ ఏసీపీగా ప్రభుత్వం బదిలీ చేసింది. ఆయన గురువారం ఎండాడలో గల మహిళా పోలీస్‌స్టేషన్‌లో బాధ్యతలు తీసుకున్నారు.

### జీవీఎంసీ సీసీపీ సురేష్ బదిలీ

**సాక్షి, విశాఖపట్నం:** జీవీఎంసీ చీఫ్ సిటీ ప్లానర్(సీసీపీ) సురేష్ కుమార్‌కు స్థానచలనం కలిగింది. తదుపరి పోస్టింగ్ ఇవ్వకుండా ప్రభుత్వానికి రిపోర్ట్ చేయాలంటూ స్పెషల్ సీఎస్ అనిల్ కుమార్ సింఘాల్ ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు. అదే విధంగా జీవీఎంసీ టౌన్ ప్లానింగ్ విభాగంలో పలువురు సిటీ ప్లానర్లను కూడా బదిలీ చేశారు. సీపీగా విధులు నిర్వర్తిస్తున్న కె.మహలక్ష్మిదొరని ఏపీసీఆర్డీఏ జోనల్ జేడీగా బదిలీ చేశారు. జీవీఎంసీ సిటీ ప్లానర్లగా ఏపీసీఆర్డీఏ నుంచి కె.ధనుంజయరెడ్డి, కర్నూలు కార్పొరేషన్ నుంచి వి.మీనాకుమారిని బదిలీ చేస్తూ గురువారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు.

### రేపు పింఛన్ల పంపిణీ

**మహారాణిపేట:** సెప్టెంబర్‌కు సంబంధించిన ఎన్టీఆర్ భరోసా పింఛన్లు ఈ నెల 31న పంపిణీ చేయనున్నట్లు కలెక్టర్ ఎం.ఎన్.హరేందిర ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. సెప్టెంబర్ ఒకటో తేదీ ఆదివారం కావడంతో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందని, శనివారం అందని వారికి సోమవారం అందిస్తామని పేర్కొన్నారు. జిల్లాలో 1,62,943 మందికి రూ.69.99 కోట్లు మంజూరు చేశామన్నారు. నాలుగు మండలాల పరిధిలో 27,058 మంది, పట్టణ ప్రాంతంలో 1,35,885 మంది పింఛన్‌దారులున్నట్లు చెప్పారు. ఇప్పటికే మ్యాపింగ్ ప్రక్రియ పూర్తయిందని, ఈ నెల 31న ఉదయం 5 గంటల నుంచే సిబ్బంది ఇంటింటికీ వెళ్లి పింఛన్ అందజేయాలన్నారు. తొలి రోజే శతశాతం పూర్తి చేయాలని, ఒకవేళ సాంకేతిక సమస్య ఏర్పడిన వారికి 2న అందజేయాలన్నారు. 31న ప్రజలంతా అందుబాటులో ఉండాలని సూచించారు.

### ఉపాధ్యాయులకు సర్దుబాటు కౌన్సెలింగ్


ధ్రువపత్రాలను పరిశీలిస్తున్న అధికారులు

**విశాఖ విద్య:** జిల్లా విద్యాశాఖలో సర్‌ప్లస్ ఉపాధ్యాయులను అవసరమైన స్కూళ్లలో సర్దుబాటు చేసే నిమిత్తం గురువారం డీఈవో కార్యాలయంలో కౌన్సెలింగ్ నిర్వహించారు. మండల స్థాయిలో నిర్వహించిన వర్క్ అడ్జెస్ట్‌మెంట్‌లో మిగిలిన ఉపాధ్యాయులను డివిజన్ పరిధిలోని పాఠశాలలకు పంపించారు. ఈ నేపథ్యంలో అవసరమైన ఖాళీలను గుర్తించిన విద్యాశాఖాధికారులు వాటిలో మిగులు ఉపాధ్యాయులను సర్దుబాటు చేశారు. విశాఖ, భీమిలి డివిజన్ల పరిధిలోని మండలాల్లో గల పాఠశాలలకు వీరిని కేటాయించారు. డిప్యూటీ డీఈవో సువర్ణ పర్యవేక్షణలో ఉపాధ్యాయుల వివరాలను ధృవీకరించుకున్న తరువాత ఖాళీలను ఎంపిక చేసుకునేలా వారికి వెసులుబాటు కల్పించారు. కొన్ని సబ్జెక్టుల జాబితాల్లో నెలకొన్న గందరగోళం దృష్ట్యా వాటిని వాయిదా వేసినట్లు తెలిసింది.

# ఆ భూములకే.. ‘పచ్చ’జెండా

## రైల్వే జోన్‌కు ముడసర్లోవ భూములే ఫైనల్

**రైల్వే జోన్ ఆలస్యం కావడానికి కారణం రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వాల్సిన భూమి ఇంకా రైల్వే శాఖకు అందలేదు** – కేంద్ర మంత్రి పీయూష్ గోయల్

జోన్‌కు భూములిచ్చేశామని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చెబుతోంది. కానీ ఇచ్చింది ముంపు భూమి. అది నిర్మాణాలకు పనికిరాదు – రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్

విశాఖ కేంద్రంగా రైల్వే జోన్ నిర్మించాలని భావించాం. కానీ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం భూమి ఇవ్వలేదు. జోన్ పనులు ఎలా జరుతాయి.? : – తాళ్లపాలెం సభలో ప్రధాని నరేంద్రమోదీ

మనకు రైల్వే జోన్ వచ్చేది. జగన్ ప్రభుత్వం పనికిరాని స్థలం ఇచ్చేసింది. అందుకే జోన్ రాలేదు – అప్పటి ప్రతిపక్ష నేత చంద్రబాబు

ఇవన్నీ గత ఎన్నికల ముందు బీజేపీ, టీడీపీ నేతల వ్యాఖ్యలు.

- జనవరిలోనే రైల్వేకి అప్పగించిన గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం
- అది ముంపు భూమి అంటూ బీజేపీ, టీడీపీ నేతల ఆరోపణలు
- జోన్ ఏర్పాటు చేయకుండా ఎన్నికల సమయంలో విమర్శలు
- ప్రత్యామ్నాయ భూములిస్తే నిర్మాణ పనులన్న మంత్రి అశ్వినీ వైష్ణవ్
- ఇప్పుడు ఆ భూములకే ఓకే చెప్పిన రైల్వే మంత్రి


వైర్‌లెస్ కాలనీలో జోన్ ప్రధాన కార్యాలయం నిర్మాణానికి రూపొందించిన డిజైన్స్


ముడసర్లోవలో రైల్వేకు అప్పగించిన భూములివే..

**సాక్షి, విశాఖపట్నం :** సౌత్ కోస్ట్ రైల్వే జోన్ కోసం గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం మాస్టర్ ప్లాన్ ప్రకారం మిక్స్‌డ్ జోన్‌లో ఉన్న భూమిని అప్పగిస్తే.. కేవలం ఎన్నికల స్టంట్ కోసం కూటమి నేతలు అసత్య ప్రచారాలు చేశారు. ప్రజలను నమ్మించేందుకు ఏకంగా కేంద్ర మంత్రులు కూడా పదే పదే అబద్ధాలు వల్లె వేశారు. అబ్బే.. ఇచ్చింది ముంపు భూమి అంటూ విమర్శలు గుప్పిస్తూ జోన్ ఏర్పాటు చేయకుండా తప్పించుకున్నారు. ఇప్పుడేమో ఆ భూమి నిర్మాణాలకు ఓకే అంటూ రైల్వే అధికారులు ప్రకటించడం.. త్వరలోనే జోన్ ప్రధాన కార్యాలయం పనులు ప్రారంభిస్తామని రైల్వే మంత్రి చెప్పడం గమనార్హం.

**అప్పుడు టీడీపీ ఏం చేసింది.?**

రోడ్డు విస్తరణలో భాగంగా పెందుర్తి ట్రాన్సిట్ కారిడార్ మంజూరు చేసిన సమయంలో రోడ్డు నిర్మాణానికి, రైల్వే భూముల్లో తరాలుగా ఉన్న మురికివాడల అభివృద్ధికి మొత్తం 26.11 ఎకరాలు అవసరమయ్యాయి. దీనిపై రైల్వే అధికారులతో దఫ దఫాలుగా జరిపిన చర్చలు సఫలీకృతం కాలేదు. చివరికి 1:2 నిష్పత్తిలో అంటే 52.22 ఎకరాలు ముడసర్లోవలో ఇచ్చే ప్రతిపాదనకు రైల్వే అధికారులు అంగీకరించారు. ముడసర్లోవ స్థలం రైల్వేకి ఇచ్చేందుకు 2013 ఫిబ్రవరి 2న నం.55/12తో జీవీఎంసీ కౌన్సిల్‌లో తీర్మానం చేశారు. దీనిని ఆమోదిస్తూ రాష్ట్ర ప్రభుత్వం 2015 నవంబర్ 26న జీవో ఎంఎస్ నం. 254 జారీ చేసింది. ముడసర్లోవలో సర్వే నెం.26లో జీవీఎంసీకి చెందిన సుమారు 270 ఎకరాలు పోరంబోకు ఉండగా, ఇందులో 52 ఎకరాలు రైల్వే శాఖకి అప్పగించేందుకు నిర్ణయించారు. అప్పట్లో రైల్వే అధికారులతో సంయుక్తంగా తనిఖీలు చేసి, వారు ఆమోదించిన తర్వాతే భూమి అప్పగింత చర్యలు చేపట్టారు. జీవీఎంసీ, రైల్వేల మధ్య 2013లో ఒప్పందం కుదిరితే 2014 నుంచి 2019 వరకూ ఐదేళ్లపాటు టీడీపీ ప్రభుత్వమే అధికారంలో ఉంది. అటు కేంద్రంలో కూడా ఉన్నది ఎన్డీయే ప్రభుత్వమే. అలాంటప్పుడు ఆ ప్రభుత్వాల హయాంలో ఈ భూములను రైల్వేకు ఎందుకు అప్పగించలేదంటే కూటమి నేతల దగ్గర సమాధానం లేదు.

### ‘మిక్స్‌డ్ జోన్’ అని చెప్పినా అసత్య ప్రచారం

వాస్తవానికి రైల్వేకు ఇచ్చిన ఈ స్థలం వీఎంఆర్డీఏ మాస్టర్ ప్లాన్ ప్రకారం మిక్స్‌డ్ జోన్ అని, ఏ విధమైన భవనాలైనా నిర్మించుకునేందుకు అనుకూలమని ధ్రువీకరించారు. ఆ భూమి చెరువు బ్యాక్ వాటర్‌లో లేదని, ముడసర్లోవ రిజర్వాయర్‌లో భాగం కాదని, ముంపునకు గురయ్యే అవకాశమే లేదని మాస్టర్ ప్లాన్‌లో స్పష్టం చేశారు. ఈ విషయంపై రైల్వే అధికారుల నుంచి ఎలాంటి అభ్యంతరాలు, లేఖలు రాలేదు కూడా. అక్కడ ఉన్న ఆక్రమణల్ని తొలగించి స్థానికులతో సంప్రదింపులు చేసి.. సమస్యలను పూర్తిస్థాయిలో పరిష్కరించి రెవెన్యూ శాఖ మొత్తం స్థలానికి కంచె కూడా వేసింది. రైల్వేకు ఇవ్వాల్సిన 52.22 ఎకరాల భూమిని క్లియర్ టైటిల్‌తో సిద్ధం చేశారు. వాల్తేరు డీఆర్ఎంకు ఈ ఏడాది జనవరి 2న లేఖలు రాసి అప్పగించారు. కానీ అది ముంపు ప్రాంతమంటూ టీడీపీ, జనసేన, బీజేపీ నేతలు అసత్య ప్రచారాలు చేశారు.

### దాచేసిన శిలాఫలకం ఎక్కడ?

విశాఖ కేంద్రంగా సౌత్ కోస్ట్ రైల్వే జోన్ ఏర్పాటుకు 2019లో కేంద్రం పచ్చజెండా ఊపింది. జోన్‌కు సంబంధించిన డీపీఆర్‌ని అదే ఏడాది ఆఖరిలో ఇచ్చేశారు. 2022లో ముందుగా జోన్ ప్రధాన కార్యాలయ నిర్మాణానికి డీఆర్ఎం కార్యాలయం ఎదురుగా ఉన్న వైర్‌లెస్ కాలనీని ఎంపిక చేశారు. అక్కడ ఉన్న 13 ఎకరాల్లో 8 ఎకరాల్లో హెడ్‌క్వార్టర్స్‌కు సంబంధించి డిజైన్లకు రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ ఆమోదముద్ర వేశారు. కాలనీని సైతం పరిశీలించారు. రూ.106 కోట్ల వ్యయంతో జోన్ ప్రధాన కార్యాలయానికి టెండర్లు పిలిచేందుకు సన్నద్ధమయ్యారు. టెండర్లు ఖరారు చేసిన తర్వాత అగ్రిమెంట్ జరిపి 36 నెలల్లో భవనాలను పూర్తి చేయాలని రైల్వే అధికారులు భావించారు. 2022 నవంబర్ 12న ప్రధాని మోదీ వర్చువల్‌గా శంకుస్థాపన చేస్తారనీ.. శిలాఫలకం కూడా సిద్ధం చేశారు. కానీ 11వ తేదీ అర్ధరాత్రి 12 గంటల తర్వాత శంకుస్థాపన కార్యక్రమాన్ని వాయిదా వేసేశారు. సిద్ధం చేసిన శిలాఫలకాన్ని దాచేశారు. దీనంతటికీ కారణం.. స్థానిక బీజేపీ, టీడీపీ నేతలే అనే ఆరోపణలు గతంలోనే వినిపించాయి. అప్పుడు శంకుస్థాపన చేస్తే క్రెడిట్ అధికారంలో ఉన్న వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి దక్కుతుందనే రాజకీయ కుట్రతో ఉత్తరాంధ్రవాసుల కలల్ని కల్లలు చేసేశారు. తర్వాత ముంపు భూమి పేరుతో రాజకీయాలు చేసి మోసం చేశారు.


జోన్ పనుల ప్రారంభోత్సవ శిలాఫలకం

## ఆన్‌లైన్‌లో మండపాలకు అనుమతులు

- సింగిల్ విండో విధానం అమలు
- నేటి నుంచి అందుబాటులోకి వెబ్‌సైట్

**విశాఖ సిటీ:** వినాయక మండపాల అనుమతులకు పోలీసులు సింగిల్ విండో విధానాన్ని అమల్లోకి తీసుకువస్తున్నారు. ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకుంటే అనుమతులు ఇచ్చేలా వెబ్‌సైట్‌ను సిద్ధం చేస్తున్నారు. ఈ వెబ్‌సైట్ శుక్రవారం నుంచి అందుబాటులోకి రానుంది. గతంలో వినాయక మండపాల ఏర్పాటు కోసం నిర్వాహకులు అగ్నిమాపక, పురపాలక, విద్యుత్, పోలీస్ శాఖ అధికారుల నుంచి నిరభ్యంతర (ఎన్ఓసీ) పత్రాన్ని తీసుకోవాల్సి వచ్చేంది. ఇప్పుడు అన్ని కార్యాలయాల చుట్టూ తిరిగే అవకాశం లేకుండా సింగిల్ విండో ద్వారా అనుమతులు పొందే విధానాన్ని రూపొందించారు. ఇందులో భాగంగా నిర్వాహకులు 7995095800కు వాట్సాప్ ద్వారా HI అని సందేశం పంపిస్తే.. ఎన్ఓసీ కోసం అనుసరించాల్సిన ప్రక్రియ సమాచారం మొబైల్‌కు వస్తుంది. దాని ప్రకారం ganeshutsav. net వెబ్‌సైట్‌లో గణేష్ మండపం ఏర్పాటు చేయాలనుకునే కమిటీ సభ్యుల వివరాలు, మండపం ఏర్పాటు చేసే ప్రదేశం, ఏ పోలీస్ స్టేషన్ పరిధిలోకి వస్తుంది, విగ్రహం ఎత్తు, మండపం ఎత్తు, విగ్రహ ప్రతిష్ట జరిగే తేదీ, నిమజ్జనం తేదీ, సమయం, అందుకు వినియోగించే వాహనం వంటి వివరాలను నమోదు చేసి దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. ఈ దరఖాస్తులు సంబంధిత పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్ఓకు వెళుతుంది. ఆయన ఆధ్వర్యంలో పురపాలక, అగ్నిమాపక, విద్యుత్ శాఖ సిబ్బంది బృందంగా ఏర్పడి మండలం ఏర్పాటు చేసే ప్రదేశాన్ని సందర్శిస్తారు. అక్కడ అన్ని సానుకూలంగా ఉంటే క్యూఆర్ కోడ్‌తో కూడిన నిరభ్యంతర పత్రాన్ని జారీ చేస్తారు. అనుమతికి అవసరమైన రుసుము వివరాలను తెలియజేస్తారు. నిర్వాహకులు వారికి దగ్గరలో ఉన్న మీ సేవా కేంద్రంలో రుసుము చెల్లించి రశీదును వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేస్తే.. ఎస్‌హెచ్ఓ వాటిని పరిశీలించి వెంటనే ఎన్ఓసీ పత్రాన్ని జారీ చేస్తారు. ఈ పత్రాన్ని ప్రింట్ తీసి గణేష్ మండపంలో ఉంచాల్సి ఉంటుంది. పోలీసుల సందర్శన సమయంలో క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసి తనిఖీ చేయనున్నారు.

### నేడు హైకోర్టు న్యాయమూర్తుల రాక

**మహారాణిపేట :** ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ చీమలపాటి రవి, జస్టిస్ టిఎస్ రవి శుక్రవారం విశాఖ వస్తున్నారు. రాత్రికి విశాఖలో బస చేస్తారు. ఈనెల 31న సిరిపురం చిల్డ్రన్స్ ఎరీనాలో మహిళా న్యాయవాదుల సదస్సులో పాల్గొంటారు.

# బియ్యంతోనే సరిపెట్టేస్తారా?

కూటమి ప్రభుత్వంలో పేదలకు పూర్తిస్థాయి సరకుల పంపిణీ కలగానే మిగిలిపోయింది. రాగి పిండి అన్నారు. వంట నూనె ఇస్తామన్నారు. నాణ్యమైన కందిపప్పు సరఫరా చేస్తామని బీరాలు పలికారు. ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా మరిన్ని నిత్యావసరాలు అందజేస్తామని బాకాలు ఊదారు. చివరకు నెల ప్రారంభమయ్యే సరికి కేవలం బియ్యంతో సరిపెట్టేస్తున్నారు. కందిపప్పు గోదాములు దాటడం లేదు. రాగిపిండి ఇండెంటే లేదు. వంట నూనె ఊసే లేదు. కేవలం ప్రచార ఆర్భాటాలు చేయడంలో చంద్రబాబు ప్రభుత్వానికి తిరుగులేదని మరోసారి నిరూపితమైంది. రేషన్ కార్డుదారులకు కొత్త నిత్యావసరాలు అందించకపోగా.. ఉన్న సరకుల్లో కోత పెట్టి పేదలకు ఆవేదన మిగుల్చుతున్నారు.

- రేషన్ సరకులకు కత్తెర
- కందిపప్పు, పంచదార, గోధుమ పిండి ఊసేలేదు



**మహారాణిపేట:** పౌర సరఫరాల ద్వారా నిరుపేదలకు అందిస్తున్న నిత్యావసరాల పంపిణీలో కూటమి ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శిస్తోంది. ఇప్పటి వరకు కార్డుదారులను పట్టించుకున్న పాపాన పోలేదు. ఎన్నికల ముందు తెలుపు కార్డుదారులకు ఐదు రకాల నిత్యావసరాలు అందిస్తామని ఊదరగొట్టి.. అధికారంలోకి వచ్చిన తర్వాత కనీసం పంచదార కూడా ఇవ్వడం లేదు. కేవలం బియ్యం మాత్రమే ఇచ్చి చేతులు దులుపుకుంటున్నారు. దీంతో పేద, బడుగు, బలహీన వర్గాల ప్రజలు అధిక ధరలకు నిత్యావసరాలను కొనుగోలు చేయాల్సి వస్తోంది. జిల్లాలో 5,12,619 తెలుపు కార్డుదారులున్నారు. 625 చౌకధరల డిపోలు ఉన్నాయి. 21 మంది చెకింగ్ ఇన్‌స్పెక్టర్లు, నాలుగు మండలాల డిప్యూటీ తహసీల్దార్లు ఈ విభాగంలో పనిచేస్తున్నారు. జిల్లాలో డోర్ టూ డోర్ పంపిణీ కోసం 310 వాహనాలను వినియోగిస్తున్నారు. జూలై, ఆగస్టులో కేవలం బియ్యం మాత్రమే పంపిణీ చేయగా.. సెప్టెంబర్‌లో కూడా బియ్యం మాత్రమే అందించనున్నారు. మిగతా నిత్యావసర వస్తువులేవీ సరఫరా చేయడం లేదని సమాచారం.

**పేదలతో ఆటలు**

కొత్త ప్రభుత్వం ఏర్పాటైంది. మంచి చేస్తుందని ప్రజలు ఆశించడం సహజం. అయితే మన రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం వచ్చిన రెండు నెలలకే ప్రజా వ్యతిరేకతను మూటగట్టుకుంది. ప్రజా సంక్షేమం, అభివృద్ధి ఆలోచనలను విస్మరించి దాడులను ప్రోత్సహించడం, శాంతి భద్రతలకు విఘాతం కలిగించడంతో అన్ని వర్గాల వారు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. ఖరీఫ్ సాగుకు ఇప్పటికే అందాల్సిన రైతన్నకు పెట్టుబడి సాయం అందలేదు. తల్లికి వందనం కింద విద్యార్థుల తల్లుల ఖాతాలకు నిధులు జమ కాలేదు. చేయూత లబ్ధి చాలా మందికి అందని ద్రాక్షగా మారింది. మత్స్యకార భరోసా, నిరుద్యోగ భృతి ఊసేలేదు. తాజాగా పేదల జీవనానికి అవసరమైన రేషన్ సరకుల్లోనూ కోత విధించింది. గత రెండు నెలలు కందిపప్పు, పంచదార, గోధుమ పిండి ఇవ్వకుండా పేద వర్గాలకు ఆవేదన మిగిల్చింది. మరో వైపు గిరిజన ప్రాంతాలకు ఎండీయూ వాహన సేవలను నిలుపుదల చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఇదే ఒరవడి దశలవారీగా మైదాన ప్రాంతాల్లోనూ అమలు చేసేందుకు ప్రయత్నిస్తోంది. ఇటీవల సీఎం చంద్రబాబు, పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ జరిపిన చర్చల్లో ఎండీయూ వాహనాలను ఇక నిలిపివేయాలని నిర్ణయించినట్లు తెలుస్తోంది. ‘ఇంటింటికీ రేషన్ పంపిణీ మూర్ఖపు నిర్ణయం.. రేషన్ పంపిణీ చేసే మొబైల్ డిస్పెన్సింగ్ యూనిట్ల (ఎండీయూ) వల్ల తీవ్ర నష్టం కలుగుతోంది, రేషన్ డోర్ డెలివరీపై త్వరలో స్టాక్ హోల్డర్లతో చర్చించి నిర్ణయం తీసుకుంటామని’ మంత్రి నాదెండ్ల చెప్పడం ఈ వాహనాలతో ఉపాధి పొందుతున్న వారిని ఆందోళనకు గురి చేస్తోంది. ఎండీయూ సిస్టం రద్దు చేసి డీలర్ దగ్గరకే లబ్ధిదారులు వెళ్లే పాత విధానాన్నే అమలు చేస్తారని.. ఇక రేషన్ కోసం గంటలు, రోజుల తరబడి డిపోల వద్ద పడిగాపులు కాయాల్సిన రోజులు దగ్గర్లోనే ఉన్నాయన్న ఆవేదన లబ్ధిదారుల్లో కనిపిస్తోంది.

# వాయు‘గండం’ వస్తోంది

- తీవ్ర అల్పపీడనంగా విశాఖలోనే తీరం దాటే సూచనలు
- మత్స్యకారులు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరిక
- 31న భారీ వర్షాలు కురిసే అవకాశం




ఎగిసి పడుతున్న అలలు

**సాక్షి, విశాఖపట్నం :** మహా నగరానికి వాయుగండం పొంచి ఉంది. విశాఖపట్నానికి తూర్పు ప్రాంతంలో ఉత్తర బంగాళాఖాతంలో గురువారం ఉదయం అల్పపీడనం ఏర్పడింది. ఇది సముద్రంలోనే బలపడి తీవ్ర అల్పపీడనంగా మారనుంది. నెమ్మదిగా కదులుతున్న ఈ అల్పపీడనం.. తీవ్ర అల్పపీడనంగా బలపడిన తర్వాత.. విశాఖ సమీపంలోనే తీరం దాటే అవకాశాలు ఎక్కువగా కనిపిస్తున్నాయి. దీంతో ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరిస్తున్నారు. భూభాగంలోకి వచ్చిన తర్వాత.. విశాఖ మీదుగా ప్రయాణిస్తూ.. తెలంగాణ వైపుగా కదులుతూ సెప్టెంబర్ 2న వాయుగుండంగా బలపడనుంది. ఓవైపు బలమైన గాలులు మరోవైపు గురువారం అర్ధరాత్రి నుంచి జిల్లా అంతటా భారీ వర్షాలు కురిసే సూచనలున్నాయి. సెప్టెంబర్ 1వరకూ విస్తారంగా వర్షాలు కురుస్తాయి. తీరం వెంబడి గంటకు 45 నుంచి 55 కి.మీ వేగంతో గాలులు వీచే అవకాశం ఉందనీ.. ఈ గాలుల కారణంగా అలలు కూడా ఉవ్వెత్తున ఎగసిపడతాయని అధికారులు చెబుతున్నారు. మత్స్యకారులెవ్వరూ వేటకు వెళ్లరాదని హెచ్చరించారు. తూర్పుగోదావరి నుంచి శ్రీకాకుళం జిల్లా కవిటి వరకూ ప్రతి చోటా అలలు 1.2 నుంచి 1.9 మీ/సెకను వేగంతో తీరం వైపు దూసుకొస్తుంటాయని.. సందర్శకులు కూడా అప్రమత్తంగా వ్యవహరించాలని హెచ్చరిస్తున్నారు. పోర్టు, నేవీ, కోస్ట్‌గార్డ్ సిబ్బంది కూడా జాగ్రత్త చర్యలు తీసుకోవాలని సూచించారు. లోతట్టు ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్నారు. ఈ మేరకు జిల్లా కలెక్టరేట్‌తో పాటు జీవీఎంసీ అలెర్ట్ అయింది. సహాయక చర్యలు అందించేందుకు ప్రత్యేక టీమ్‌లని అందుబాటులో ఉంచడంతో పాటు కంట్రోల్ రూమ్‌లని ఏర్పాటు చేసింది.

### అధికారులు అప్రమత్తంగా ఉండండి

- జీవీఎంసీ కార్యాలయంలో కంట్రోల్ రూమ్

**డాబాగార్డెన్స్:** నగరంలో భారీ వర్షాలు కురుస్తున్న దృష్ట్యా నగర ప్రజలకు ఎటువంటి ప్రాణ, ఆస్తి నష్టం వాటిల్లకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్ అధికారులను ఆదేశించారు. జీవీఎంసీ అదనపు కమిషనర్–1 పర్యవేక్షణలో సిటీ ఆపరేషన్ సెంటర్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఇంజినీరింగ్ విభాగాధిపతులు, టౌన్‌ప్లానింగ్ అధికారులు, సిబ్బంది సమన్వయంతో కొండవాలు ప్రాంత ప్రజలను అప్రమత్తం చేయాలని, నిరంతరం తాగునీటికి అంతరాయం లేకుండా చూడాలన్నారు. ముందస్తుగా మ్యాన్‌హోల్స్‌పై మూతలు సరిచేయాలని, కాలువలను శుభ్రం చేయాలని సూచించారు. పురాతన భవనాల్లో నివసిస్తున్న వారిని గుర్తించి.. తాత్కాలిక పునరావాస కేంద్రాలకు తరలించాలన్నారు. జోనల్ కమిషనర్లు వార్డుల వారీగా టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేసుకుని.. 3 షిఫ్టుల్లో నిరంతర పర్యవేక్షణలో ఉండాలన్నారు. పునరావాస కేంద్రాల వద్ద ఆహారం, నీరు ఏర్పాటుకు నివాస సంక్షేమ సంఘాల సహకారం తీసుకోవాలన్నారు. నగర ప్రజల సహాయక చర్యల కోసం జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో ఈ నెల 31 వరకు కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని, 1800 4250 0009 టోల్ ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేసి సహాయం పొందవచ్చన్నారు.



## స్వేచ్ఛగా పనిచేసుకోనివ్వాలి

వైద్యులు సొంత కుటుంబ సభ్యుల్లా రోగులకు సేవలందిస్తారు. అటువంటి వారిని స్వేచ్ఛగా పనిచేసుకోనివ్వాలి తప్ప దాడులకు పాల్పడకూడదు. దాడులు చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకునేందుకు వీలుగా చట్టాల్లో మార్పులు తీసుకురావాలి. విధి నిర్వహణలో ఉండే మహిళా ఉద్యోగులు, వైద్యులకు 24 గంటల పాటు పోలీసు భద్రత ఉండాలి. ప్రభుత్వాస్పత్రుల్లో తప్పనిసరిగా పోలీస్ అవుట్ పోస్టును ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది.

– డాక్టర్ పి.జగదీశ్వరరావు, డీఎంహెచ్‌వో



## రాత్రి పూట భద్రత పెంచాలి



ఆస్పత్రిల్లో రోగులకు సేవలందించడంలో నర్సులు పాత్ర చాలా కీలకం. అయితే నర్సులకు తగిన భద్రత, సౌకర్యాలు లేవు. రాత్రి వేళ ప్రతి వార్డుకు సెక్యూరిటీ ఏర్పాటు చేయాలి. రెస్ట్ రూమ్‌లు అవసరం ఉంది. రాత్రి పూట మరింతంగా భద్రత పెంచాలి. ఆస్పత్రుల్లో తప్పనిసరిగా అవుట్ పోస్టు ఉండాలి. వుమెన్ సెల్ ఏర్పాటు చేయాలి. మహిళా ఉద్యోగుల దగ్గర మహిళా భద్రత సిబ్బందిని నియమించాలి.

–రాజేశ్వరి, హెడ్ నర్స్, ప్రాంతీయ కంటి ఆస్పత్రి, ఏపీ నర్సుల సంఘం మాజీ ఉపాధ్యక్షురాలు

# పలు రైళ్లకు అదనపు కోచ్‌లు

తాటిచెట్లపాలెం: ప్రయాణికుల రద్దీ దృష్ట్యా పలు రైళ్లకు తాత్కాలికంగా మరిన్ని అదనపు కోచ్‌లను జతచేస్తున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డీసీఎం సందీప్ తెలిపారు. సంబల్‌పూర్-నాందేడ్(20809) సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్‌కు సెప్టెంబరు 1 నుంచి 30వ తేదీ వరకు (రైలు నడిచే రోజుల్లో), నాందేడ్-సంబల్‌పూర్ (20810) సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్‌కు సెప్టెంబరు 2 నుంచి అక్టోబరు 1వ తేదీ వరకు (రైలు నడిచే రోజుల్లో) ఒక థర్డ్ ఏసీ ఎకానమి, ఒక స్లీపర్ క్లాస్ కోచ్‌లను జతచేస్తున్నారు. సంబల్‌పూర్-ఈరోడ్ (08311) స్పెషల్ ఎక్స్‌ప్రెస్‌కు సెప్టెంబరు 4 నుంచి 25వ తేదీ వరకు (రైలు నడిచే రోజుల్లో), ఈరోడ్-సంబల్‌పూర్ (08312) స్పెషల్ ఎక్స్‌ప్రెస్‌కు సెప్టెంబరు 6 నుంచి 27వ తేదీ వరకు (రైలు నడిచే రోజుల్లో) ఒక థర్డ్ ఏసీ ఎకానమి, ఒక స్లీపర్ క్లాస్ కోచ్ జతచేస్తున్నారు.

**చెన్నై-భువనేశ్వర్ స్పెషల్ రద్దు**

నిర్వహణా పనుల నిమిత్తం చెన్నై-భువనేశ్వర్-చెన్నై స్పెషల్ రైళ్లు ఆయా తేదీల్లో రద్దు చేస్తున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డీసీఎం సందీప్ తెలిపారు. సెప్టెంబరు 2, 9వ తేదీల్లో ఎంజీఆర్ చెన్నై సెంట్రల్-భువనేశ్వర్(06073) స్పెషల్ ఎక్స్‌ప్రెస్, సెప్టెంబరు 3, 10వ తేదీల్లో భువనేశ్వర్-ఎంజీఆర్ చెన్నై సెంట్రల్ (06074) స్పెషల్ ఎక్స్‌ప్రెస్‌లు రద్దయ్యాయి.

## • చినబాబుకు నో రూల్స్!



చిన్నపాటి నిబంధనలు మీరినా చలానాలతో నడ్డి విరిచే పోలీసులు.. చినబాబు లోకేష్‌కు మాత్రం ఎర్ర తివాచీ పరిచారు. రాష్ట్ర మంత్రి నారా లోకేష్ గురువారం విశాఖలో పర్యటించారు. కోర్టుకు వెళ్లిన సందర్భంలో పోలీసుల హడావుడి అంతా ఇంతా కాదు. కాగా.. లోకేష్ వాహనం నేరుగా నో పార్కింగ్ బోర్డుకు ముందే పార్క్ చేశారు. చినబాబా మజాకా! ఇది చూసిన కొందరు రెడ్‌బుక్‌లో అలా రాసి ఉందేమో? అంటూ గుసగుసలాడారు. మంత్రి అలా చేశారని మీరూ చేశారనుకోండి.. పోలీసులు రూ.1,035 ఫైన్ వేసి ముక్కుపిండి వసూలు చేస్తారు.. జాగ్రత్త సుమీ! - సాక్షి ఫొటోగ్రాఫర్

## • శభాష్ హోంగార్డ్



కేవలం ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించడమే తన బాధ్యత అనుకోలేదు హోంగార్డు మసేను. పూర్ణామార్కెట్ దుర్గాలమ్మ గుడి జంక్షన్‌లో ప్రమాదకర మ్యాన్‌హోల్ నోరు తెరిచి ఉండడాన్ని గుర్తించాడు. నిత్యం రద్దీగా ఉండే ఈ ప్రాంతంలో మ్యాన్‌హోల్ తెరిచి ఉంచడంతో ప్రమాదం జరిగే అవకాశం ఉందని గ్రహించాడు. తన పని కాకపోయినా బాధ్యతతో ట్రాఫిక్ నియంత్రణకు ఏర్పాటు చేసిన బారికేడ్లను మ్యాన్‌హోల్‌కు అడ్డుగా పెట్టాడు. అలాగే నిత్యం వాహనాలతో రద్దీగా ఉండే ఈ జంక్షన్‌లో వృద్ధులు, దివ్యాంగులను రోడ్డు దాటిస్తూ సహాయపడుతున్నాడు. - సాక్షి ఫొటోగ్రాఫర్

## • ముడసర్లోవ పార్కులో సమాధులు!



ముడసర్లోవ పార్కు.. శ్మశానంగా మారిపోయింది. పిల్లలు ఆడుకునే మైదానంలో ఎటు చూసినా సమాధులే కనిపిస్తున్నాయి. ఇది అర్థం కాని సందర్శకులు కొందరు ఇది పార్కా.? శ్మశనమా అంటూ అక్కడి సిబ్బందిని నిలదీశారు. దీంతో ఇక్కడ సినిమా షూటింగ్ జరగబోతుందని, ఇందుకోసం సెట్ వేస్తున్నారని సిబ్బంది చెప్పడంతో సందర్శకులు అవునా అంటూ నోరెళ్లబెట్టారు. తమిళ సినీ సూపర్‌స్టార్ రజనీకాంత్ కథానాయకుడిగా లోకేష్ కనకరాజ్ దర్శకత్వంలో 'కూలీ' సినిమా చిత్రీకరణ ఒకటి, రెండు రోజుల్లో ఇక్కడ ప్రారంభం కానుంది. ఇందు కోసం సినిమా యూనిట్ పచ్చని చెట్ల మధ్య సమాధులతో కూడిన శ్మశానం సెట్ వేసింది. ఇక్కడ షూటింగ్‌కు రానున్న రజనీకాంత్ కోసం ఈ ప్రాంత వాసులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. - ఆరిలోవ













## • ముస్తాబవుతున్న గణేశుడు

వినాయక చవితి వేడుకలకు విశాఖ నగరం సిద్ధమవుతోంది. ద్వారకానగర్, తాటిచెట్లపాలెం, దండుబజార్, శంకరమఠం, మధురవాడ, గాజువాక తదితర ప్రాంతాల్లో అద్భుతమైన రూపాల్లో వినాయక విగ్రహాలు తయారవుతున్నాయి. జవాన్, విద్యార్థి వినాయకుడు, సింహాద్రి అప్పన్న వినాయకుడు వంటి వినూత్న ఆకృతుల విగ్రహాల తయారీలో కళాకారులు నిమగ్నమయ్యారు. వినాయక చవితికి కొద్ది రోజుల మాత్రమే ఉండటంతో కళాకారులు పనిలో వేగం పెంచారు. ఇక ఉండ్రాలస్వామికి అలంకార సామగ్రి విక్రయాలు ప్రారంభమయ్యాయి. రహదారుల పక్కన కొంత మంది చవితి పూజలో వినియోగించే గొడుగులు, ఇతర సామగ్రిని విక్రయిస్తున్నారు.

– ఫొటోలు: సాక్షి ఫొటోగ్రాఫర్స్, విశాఖపట్నం

# త్వరలో ఐటీ పాలసీ

**మంత్రి నారా లోకేష్**




మాట్లాడుతున్న మంత్రి నారా లోకేష్

బీచ్‌రోడ్డు: త్వరలో మెరుగైన ఐటీ పాలసీని ప్రకటించి, దేశంలోనే ప్రఖ్యాత కంపెనీలను రాష్ట్రానికి తీసుకువస్తామని రాష్ట్ర మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి నారా లోకేష్ అన్నారు. నగరంలోని ఒక హోటల్ నందు గురువారం రాష్ట్ర ఐటీ అసోసియేషన్ ప్రతినిధులతో ఆయన సమావేశమై, వారి సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా లోకేష్ మాట్లాడుతూ ఐటీ రంగంలో ఇప్పటికే అభివృద్ధి సాధించిన హైదరాబాద్, బెంగుళూరు, చెన్నైలో అమలు చేస్తున్న పాలసీలను అధ్యయనం చేసి, మెరుగైన ఐటీ పాలసీని తీసుకువస్తామన్నారు. రాష్ట్రంలో ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాలు కల్పించాలన్న తమ ప్రభుత్వ లక్ష్యంలో ఐటీ, ఎలక్ట్రానిక్స్ రంగాలు కీలకపాత్ర పోషించబోతున్నాయని చెప్పారు. దేశంలో టాప్–10 ఐటీ కంపెనీలతో చర్చలు జరుపుతున్నామని, త్వరలో ఐటీ పరిశ్రమ పెట్టుబడులపై శుభవార్త వింటారన్నారు. ఐఎస్‌బీ తరహాలో విశాఖలో ప్రపంచస్థాయి ఏఐ యూనివర్సిటీని ఏర్పాటు చేస్తామన్నారు. ఏఐ హబ్‌గా కూడా విశాఖను తీర్చిదిద్దుతామన్నారు. రోబోటిక్స్, హెల్త్ కేర్, ఎడ్యుకేషన్ వంటి రంగాలతో అనుసంధానించి ఐటీని వేగవంతంగా అభివృద్ధి చేస్తామన్నారు. రాబోయే ఐదేళ్లలో విశాఖపట్నాన్ని 100 బిలియన్ డాలర్ల ఎకానమీ నగరంగా తీర్చిదిద్దుతామన్నారు. ప్రస్తుతం పని చేస్తున్న ఐటీ కంపెనీలు, కొత్తగా ఏర్పాటు చేసే కంపెనీలకు ఇకపై గ్రీన్‌చానల్ ద్వారా ఇన్సెంటివ్స్ అందజేస్తామన్నారు. ఐటీ రంగంలో మహిళా పారిశ్రామికవేత్తలను ప్రోత్సహిస్తామని చెప్పారు. ఎలక్ట్రానిక్స్ రంగంలో 300 బిలియన్ డాలర్ల లక్ష్యం దిశగా భారత్ ముందుకు సాగుతోందని.. ఇందులో ఏపీ కీలకపాత్ర వహించబోతుందని వెల్లడించారు.

## బహిరంగ ప్రకటన

నా క్లయింట్ శ్రీ కాకిత రోహన్, తండ్రి. కె.హెచ్. రావు, దిగువ వివరించిన షెడ్యూల్ ఆస్తిని శ్రీమతి అక్కినేని ఉమావాణి గారి నుండి రిజిస్టర్డ్ అమ్మకం దస్తావేజు నెం.4672/2002, తేది.08.06.2022, మధురవాడ ఎస్.ఆర్.ఓ ప్రకారం కొనుగోలు చేయాలనుకుంటున్నట్లు బహిరంగ ప్రకటన ఇవ్వడమైనది.

ఆమె చెప్పిన ఆస్తిని నా క్లయింట్‌కి విక్రయించాలని నిర్ణయించుకుంది మరియు అమ్మకం అగ్రిమెంట్ తేది.08.07.2024 న ఒప్పందం ద్వారా కొంత మొత్తాన్ని పార్ట్ పేమెంట్‌గా పొందినారు.

చట్టపరమైన వారసులతో సహా ఏదైనా వ్యక్తులు, సంస్థలు ఆస్తి పై ఎవరికైనా ఎట్టి అభ్యంతరములు, క్రయపుర్‌లీలు, తనఖాలు, ఛార్జీలు, వగైరాలు ఉన్నచో ఈ ప్రకటన తేది నుండి 7 దినములలోగా వ్రాతపూర్వకంగా ఈ క్రింది తెలిపిన చిరునామాకు తెలియపరచవలెను. లేని యెడల ఈ ఆస్తి పై తదుపరి వచ్చిన అభ్యంతరములు నా క్లయింటుకు బంధింపజాలవు.

**షెడ్యూల్ ఆస్తి**

విశాఖపట్నం యొక్క రిజిస్ట్రేషన్ జిల్లా మరియు మధురవాడ యొక్క సబ్ రిజిస్ట్రేషన్ సబ్ జిల్లా మరియు గ్రేటర్ విశాఖపట్నం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని, విశాఖపట్నం, ఎండాడ గ్రామం యొక్క సర్వే నెంబ.65/27, 65/31ఎ, 84/6ఎ, 6బి, 6సి వద్ద గల ఆమోదిత ఉడా ఎల్.పి.నెం.19/1994 లే-అవుట్ (దసపల్లా లే-అవుట్) లోని విస్తీర్ణం 346.67 చ॥గ॥లు (289.85 చ॥మీ॥లు సమానమైన) అనగా ప్లాట్ నెం.266.67 చ॥గ॥లులోని ప్లాట్ నెం. 212 యొక్క భాగం ఉత్తరం వైపున విస్తీర్ణం 80 చ॥గ॥లులోని ఖాళీ ఇంటి ప్లాట్లు. **హద్దులు :** తూర్పు : వెండర్-ఫర్మ్ కు చెందిన ప్లాట్ నెంబ.205 & 211 (భాగం), దక్షిణం : ప్లాట్ నెం.212 యొక్క మిగిలిన భాగం, పడమర : ప్లాట్ నెంబ.203 & 213, ఉత్తరం : 40 అ॥ల వెడల్పు రోడ్డు.

**శ్రీమతి కంటంరెడ్డి నీలిమ దేవి, అడ్వకేట్**
లాసన్స్ బే కాలనీ, విశాఖపట్నం
**ఫోన్ : 88860 06706**

## బీఎస్‌ఎన్‌ఎల్ 4జీ సేవలు ఆరంభం

ఉక్కునగరం : బీఎస్‌ఎన్‌ఎల్ 4 జీ సేవలు ప్రారంభించడం అభినందనీయమని స్టీల్‌ప్లాంట్ సీఎండీ అతుల్ భట్ అన్నారు. బీఎస్‌ఎన్‌ఎల్ ఏపీ సర్కిల్ ఆధ్వర్యంలో విశాఖలో తొలిగా స్టీల్‌ప్లాంట్‌లో గురువారం 4జీ సేవలను ప్రారంభించింది. ఉక్కుహౌస్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో స్టీల్‌ప్లాంట్ సీఎండీ మాట్లాడుతూ బీఎస్‌ఎన్‌ఎల్ వల్ల వినియోగదారులకు పారదర్శకత, నైతిక విలువలు, తక్కువ ధరలు, కార్పొరేట్ గవర్నన్స్‌తో సేవలు లభిస్తాయన్నారు. అతి త్వరలో 5జీ సేవలు ప్రారంభమవుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. బీఎస్‌ఎన్‌ఎల్ ప్రిన్సిపల్ జీఎం పి.పాల్ విలియమ్స్ మాట్లాడుతూ ఇప్పటివరకు ప్రపంచంలో 3 దేశాలు మాత్రమే సొంత టెక్నాలజీతో 4జీ సేవలు ప్రారంభించగా.. ఇప్పుడు భారతదేశం 4వ దేశంగా ఖ్యాతిగాంచిందన్నారు. స్టీల్‌ప్లాంట్ డైరెక్టర్ (పర్సనల్) ఎస్.సి.పాండే, బీఎస్‌ఎన్‌ఎల్ ప్రిన్సిపల్ జీఎం జి.అడమ్, పాల్గొన్నారు.

# తెలుగుపై ప్రభుత్వం చిన్నచూపు

- భాషా పురస్కార గ్రహీతల పేర్లు ఆంగ్లంలో ముద్రణా?
- తెలుగు భాషా దినోత్సవం ఘనంగా చేస్తారని ఆశించి భంగపడ్డాం
- తెలుగు దండు అధ్యక్షుడు పరవస్తు ఫణిశయన సూరి ఆవేదన



తెలుగుతల్లి విగ్రహానికి పూలు చల్లుతున్న సాహితీ వేత్తలు

మద్దిలపాలెం: కూటమి ప్రభుత్వం తెలుగు భాషా దినోత్సవాన్ని చిన్న చూపు చూసిందని.. ఘనంగా చేస్తుందని ఆశించి భంగపడ్డామని తెలుగుదండు అధ్యక్షుడు పరవస్తు ఫణిశయన సూరి ఆవేదన వ్యక్తం చేశారు. మద్దిలపాలెం తెలుగుతల్లి విగ్రహం వద్ద గురువారం తెలుగు భాషా దినోత్సవం నిర్వహించారు. తెలుగుతల్లి విగ్రహానికి సాహితీవేత్తలు పూలమాలలు వేశారు. అనంతరం సూరి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం తెలుగు భాషా పురస్కార గ్రహీతల పేర్లను సైతం ఆంగ్లంలో ముద్రించి భాషాభిమానులను నిరుత్సాహానికి గురి చేసిందన్నారు. మాతృభాష పరిరక్షణకు పెద్ద పీట వేయాల్సిన ప్రభుత్వం ఇలా వ్యవహరించడం విచారకరమన్నారు. ప్రాథమిక విద్యలో తెలుగు భాషను అమలు చేసే విషయంలో ప్రభుత్వం తన వైఖరిని వెంటనే ప్రకటించాలని ఆయన డిమాండ్ చేశారు. భవిష్యత్ తరాలకు తెలుగు భాషను భద్రంగా అందించడానికి ప్రభుత్వం ముందుకు రావాలన్నారు. కార్యక్రమంలో సాహితీవేత్తలు కామేశ్వరరావు, ఎన్.ప్రకాశరావు, హేమ, నాగుల శ్రీనివాస్, చిన సూర్యనారాయణ, శంకర్, శ్యాంసుందర్, ఆచార్య సూరప్పడు, కిరణ్ కుమార్, జాతీయ జర్నలిస్టుల సంఘం కార్యదర్శి గంట్ల శ్రీనుబాబు, తదితరులు పాల్గొన్నారు.

# క్రీడల పట్ల శ్రద్ధ అవసరం



మేజర్ ధ్యాన్‌చంద్ విగ్రహానికి పూలమాల వేస్తున్న కలెక్టర్ హరేందిర ప్రసాద్

విశాఖ స్పోర్ట్స్: జాతీయ క్రీడా దినోత్సవాన్ని విశాఖలో ఘనంగా నిర్వహించారు. జిల్లా క్రీడాప్రాధికార సంస్థ, ది ఒలింపిక్ సంఘం విశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో తొలుత కలెక్టర్ హరిందేర ప్రసాద్ ఏయూ జిమ్నాజియం గ్రౌండ్ వద్ద గల ధ్యాన్‌చంద్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఏయూ కెమిస్ట్రీ విభాగంలో జరిగిన కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ క్రీడల పట్ల యువత శ్రద్ధ కనబరిచి జాతి గౌరవాన్ని నిలపాలన్నారు. గతంలో మాదిరిగానే సీఎస్ఆర్ నిధులతో క్రీడల అభివృద్ధికి జిల్లా యంత్రాంగం కృషి చేస్తుందన్నారు. ఒకో కంపెనీ ఒక్కో క్రీడను ప్రోత్సహించేలా పారిశ్రామికవేత్తలతో చర్చిస్తామన్నారు. ఎమ్మెల్యే ఎంవిజిఆర్ నాయుడు మాట్లాడుతూ యువత క్రీడల్లో రాణించాలని ఆకాంక్షించారు. ది ఒలింపిక్ సంఘం అధ్యక్షుడు ప్రసన్నకుమార్ మాట్లాడుతూ ప్రభుత్వంతో పాటు ప్రైవేట్ సంస్థల భాగస్వామ్యం ఉంటేనే మరింతగా క్రీడల్లో రాణించవచ్చన్నారు. ఈ సందర్భంగా జిల్లా నుంచి క్రీడల్లో రాణించిన ఆటగాళ్లను, కోచ్‌లను పలు అవార్డులతో సత్కరించారు. స్పోర్ట్స్ జర్నలిస్ట్ అవార్డు భాస్కర్ అందుకున్నాడు. కార్యక్రమంలో ద్రోణాచార్య అవార్డీ వేంకటేశ్వరరావు, సూర్యనారాయణ, వెంకట్‌రామ్, జూన్ గాలియట్, విజయ్‌మోహన్, క్రీడా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

## • ఎమ్మెల్యే గారు.. 'చెత్త' గించండి.?



మద్దిలపాలెం జాతీయ రహదారి వద్ద బస్టాప్‌కు దగ్గరలోని డస్ట్‌బిన్ పాడైపోయింది. వర్షాలకు అందులోని చెత్త కుళ్లిపోయి దుర్గంధం వెదజల్లుతోంది. అటుగా వెళ్తున్న వారు ఆ దుర్గంధాన్ని భరించలేక ముక్కు మూసుకోవాల్సి వస్తోంది. 'హోర్డింగ్‌లు బాగానే ఎక్కారు ఎమ్మెల్యే గారు. కానీ కింద ఉన్న చెత్తను కూడా కొంచెం పట్టించుకోండి. అటు వైపు వెళ్తే ముక్కు పుటలు అదిరిపోతున్నాయి. భరించలేకపోతున్నాం' అంటూ స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. - సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం

# కోతకు గురైన తీరం



బీచ్‌రోడ్డు: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం వల్ల గురువారం సముద్రం అల్లకల్లోలంగా మారింది. పెద్ద పెద్ద అలలతో ఉప్పొంగుతోంది. భారీ అలల కారణంగా తీరం కోతకు గురవుతోంది. ఇప్పటికే పాడైన తీరం రక్షణ గోడ ఈ అలలకు కొట్టుకుపోతోంది. మరోవైపు, తీరంలోని ఇసుక తెన్నెలను అలలు లోపలికి లాగేస్తున్నాయి. దీంతో వైఎంసీఏ నుంచి కోస్టల్ బ్యాటరీ వరకు తీరం అధ్వానంగా మారింది. సందర్శకులు సముద్రం దగ్గరకు వెళ్లకుండా బీచ్‌గార్డులు హెచ్చరికలు జారీ చేశారు.

# 'చంద్రంపాలెం' విద్యార్థులకు పతకాలు



విజేతలతో ఇన్‌చార్జి హెచ్‌ఎం సోమయాజులు, ఉపాధ్యాయులు

మధురవాడ: రాష్ట్రస్థాయి గ్రాప్లింగ్, రెజ్లింగ్ పోటీల్లో చంద్రంపాలెం విద్యార్థులు పతకాలు సాధించారు. రేణిగుంటలో ఈ నెల 25, 26 తేదీల్లో 4వ రాష్ట్ర స్థాయి గ్రాప్లింగ్, రెజ్లింగ్ పోటీలు జరిగాయి. ఇందులో అండర్–13 బాలుర విభాగంలో కె.పవన్, పి.రవి స్వర్ణాలు, అండర్–15 బాలికల విభాగంలో జీవిత వెండి, ఎం.లలిత కాంస్యం, జూనియర్ విభాగంలో ఎస్.గాయత్రి స్వర్ణం, వెండి పతకాలు, బాలుర విభాగంలో టి.నరేంద్ర, నితిష్, రేవంత్ సాయి బంగారు పతకాలు, పవన్, సాయికుమార్ వెండి పతకాలు, క్యాడెట్స్ విభాగంలో జీవన్ కుమార్, చైతన్య బంగారు పతకాలు, జి.హర్ష, పి.కార్తీక్, కార్తికేయ వెండి పతకాలు సాధించారు. వీరంతా అక్టోబర్‌లో హర్యానాలో జరిగే జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. పాఠశాలలో గురువారం నిర్వహించిన ఓ కార్యక్రమంలో ఇన్‌చార్జి హెచ్‌ఎం ఎస్‌వీఎస్ సోమయాజులు, పీడీ రాము విజేతలను అభినందించారు.

# అపార్ట్‌మెంట్‌పై పిడుగు

**దెబ్బతిన్న లిఫ్టులు, విద్యుత్ పరికరాలు**



పిడుగు పడి దెబ్బతిన్న లక్ష్మి టవర్స్ అపార్ట్‌మెంట్ పై భాగం గోడ

మధురవాడ: శివశక్తినగర్ రోడ్డులోని లక్ష్మీటవర్స్ అపార్ట్‌మెంట్‌పై బుధవారం రాత్రి పిడుగుపడింది. ఈ కారణంగా 6వ అంతస్తు పైన పిల్లర్, గోడ దెబ్బతిన్నాయి. అపార్ట్‌మెంట్‌లోని కొన్ని ఫ్లాట్లలో టీవీలు, ఫ్యాన్‌లు, విద్యుత్ పరికరాలతో పాటు మూడు లిఫ్టులు దెబ్బతిన్నాయి.

ఈదురు గాలులకు శివశక్తినగర్ రోడ్డులోని ముత్యాలమ్మ కాలనీ సమీపంలో విద్యుత్ తీగలు తెగిపోయాయి. దీంతో ఆ ప్రాంతంలో చాలా సేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. మిథిలాపురి వుడా కాలనీ, చంద్రంపాలెం, స్వతంత్రనగర్, వాంబే కాలనీల్లో విద్యుత్ సరఫరాకు ఇబ్బందులు ఎదురయ్యాయి.